నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
8 | గురువారం 3 ఏప్రిల్ 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

# 'పది' పరీక్షలు ముగిశాయోచ్..



మంచిర్యాలలో పరీక్షలు ముగిసిన ఆనందంలో కేరింతలు కొడుతున్న విద్యార్థినులు

నస్పూర్/కోటపల్లి/ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, ఏప్రిల్ 2 : మంచిర్యాల జిల్లాలో పదవ తరగతి వార్షిక పరీక్షలు బుధవారంతో ప్రశాంతంగా ముగిశాయి. విద్యార్థులు ఉత్సాహంగా పరీక్షా కేంద్రాల నుంచి బయటకు వచ్చి కేరింతలు కొట్టారు. పరీక్ష కేంద్రాలతో పాటు ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్ల వద్ద స్నేహితులకు 'బై బై' చెబుతూ ఇంటిబాట పట్టారు. చివరిరోజూ సాంఘిక శాస్త్రం పరీక్షకు 49 పరీక్ష కేంద్రాల్లో మొత్తం రెగ్యులర్ 9198 మంది విద్యార్థుల్లో 23 మంది గైర్హాజరైనట్లు డీఈవో యాదయ్య తెలిపారు. మొత్తం 99.70 హాజరు శాతం నమోదైనట్లు తెలిపారు. కొన్ని సంవత్సరాలుగా ఉపాధ్యాయులతో అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ, బాధతో 'బై బై' మేడం..' అంటూ కోటపల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థినులు ఇంటి బాట పట్టారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో పదవ తరగతి పరీక్షల్లో చివరి రోజూ మొత్తం 36 పరీక్షా కేంద్రాల్లో 6547 మందికి గాను 6522 మంది విద్యార్థులు హాజరయ్యారు. 99.6 శాతం హాజరు నమోదైనట్లు అధికారులు తెలిపారు.



మంచిర్యాలలో పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

# ఎండుతున్న ఎల్లంపల్లి!



ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌లో మంచిర్యాలకు తాగునీరు సరఫరా చేసే మిషన్ భగీరథ గ్రిడ్ వద్ద నీరు తగ్గిపోయి కనిపిస్తున్న స్థలం

## ప్రాజెక్టులో 9.72 టీఎంసీలకు తగ్గిన నీటిమట్టం

- వేసవికి సరిపడా నీటి లభ్యతపై అనుమానాలు
- మంచిర్యాలకు నీటి కష్టాలు తప్పవా..!
- గూడెం లిఫ్ట్ నుంచి సాగునీటికి అధిక నీరు వదలాల్సి వస్తే ఎలా..?
- ఎండల తీవ్రత పెరిగితే తప్పని ఇబ్బందులు

కాంగ్రెస్ తెచ్చిన కరువు

మంచిర్యాల, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): మంచిర్యాల జిల్లాలో ఇప్పటికే కొంత సాగునీటి కష్టాలు మొదలయ్యాయి. అటు కడెం ప్రాజెక్టు చివరి ఆయకట్టుగా ఉన్న దండేపల్లి మండలంలోని ముక్కాసిగూడెం, నాగసముద్రం చుట్టు పక్కల గ్రామాల్లో సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయి. కాస్తో కూస్తో గూడెం లిఫ్ట్ నీళ్లయినా వస్తున్నాయనుకుంటే ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌లో నీటి మట్టం వేగంగా పడిపోతున్నది. ఏప్రిల్, మే నెలల్లో ఎండలు తీవ్రత ఎక్కువగా ఉండనున్న నేపథ్యంలో ఎల్లంపల్లి నీటికి కేవలం తాగునీటికే కేటాయిస్తే గూడెం లిఫ్ట్‌నే నమ్ముకున్న దండేపల్లి, హాజీపూర్, లక్షెట్టిపేట మండలాల్లోని రైతులకు ఇబ్బందులు తప్పవు. అలాగని గూడెం లిఫ్ట్ నుంచి సాగునీటిని నిలిపివేసి కేవలం తాగునీటికే ఎల్లంపల్లి నీరు వాడినా అవి ఎంత మేరకు సరిపోతాయేనన్న అనుమానాలు నెలకొన్నాయి. గతేడాది సంవత్సరం దాదాపు ఇదే పరిస్థితి నెలకొన్నప్పుడు మంచిర్యాలకు తాగునీటి ఇబ్బందుల రాకుండా చర్యలు తీసుకున్నారు. ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ నుంచి ప్రత్యేక కాలువలు తీసి పంప్‌హౌస్‌కు నీటి కొరత లేకుండా చూశారు. కానీ ఈ సారి అలాంటి జాగ్రత్తలు ఏవీ తీసుకోకపోవడం ఆందోళనలు రేకెత్తిస్తున్నాయి.



గూడెం ఎత్తిపోతల పథకం

### పది రోజుల్లో మరింత తగ్గనున్న నీటిమట్టం

మంచిర్యాల జిల్లాకు కల్పతరువులా ఉన్న శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో రోజురోజుకూ నీటి నిల్వలు పడిపోతున్నాయి. ప్రాజెక్ట్ మొత్తం కెపాసిటీ 20.17 టీఎంసీలు కాగా బుధవారం నాటికి 9.71 టీఎంసీల నీరు ఉంది. మార్చి 22వ తేదీన 11.16 టీఎంసీల నీరు ఉంటే పది రోజుల్లోనే దాదాపు రెండు టీఎంసీలు తగ్గింది. ఎల్లంపల్లి నుంచి హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లయ్ స్కీమ్‌కు 315 క్యూసెక్కులు, ఎన్టీపీసీకి 242 క్యూసెక్కులు, అలాగే వేమునురు పంప్‌హౌస్‌కు 247 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు. ఇది కాకుండా మిషన్‌భగీరథ స్కీమ్ కింద రామగుండం గ్రిడ్‌కు, మంచిర్యాల గ్రిడ్‌కు కలిపి 80 క్యూసెక్కుల దాకా నీరు అవసరం అవుతుంది. వీటన్నింటినీ నిటిని వదిలితే మరో వారం పదిరోజుల్లో మరో రెండు టీఎంసీలు నీటిమట్టం తగ్గుతుంది. అదే జరిగితే మంచిర్యాలకు తాగునీటి అందజేసే పంప్‌హౌస్(మిషన్ భగీరథ గ్రిడ్) సమీపంలో నీరు లేకుండా పోయే ప్రమాదం ఉంది.

### గూడెం లిఫ్ట్‌ను నడిపిస్తే కష్టమే..

కడెం ప్రాజెక్ట్ పరిధిలోని చివరి ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు ఏర్పాటు చేసిన గూడెం లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌కు శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ నుంచి 3 టీఎంసీలు నీళ్లు ఇవ్వాలనేది నిబంధన. దీని కింద దండేపల్లి, లక్షెట్టిపేట, హాజీపూర్ మండలాల్లో 30వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. కాకపోతే ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌లో 18 టీఎంసీల నీరు ఉంటేనే గూడెం లిఫ్ట్‌ను నడపాలి. కానీ గత రెండేళ్లు ఎండాకాలం ప్రారంభానికి ముందే ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌లో నీరు 18 టీఎంసీల కంటే దిగువకు చేరుతున్నది. స్థానిక రైతుల డిమాండ్ మేరకు 15వేల ఎకరాల ఆరుతడి పంటలకు నీరు ఇస్తున్నారు. ఈ మేరకు ఇప్పటికీ గూడెం లిఫ్ట్ నుంచి నీరు సరఫరా చేస్తున్నారు. గూడెం నుంచి 290 క్యూసెక్కుల నీరు వదులుతున్నారు. మరో పది రోజుల్లో ఎల్లంపల్లిలో నీరు అడుగంటితే ఈ లిఫ్ట్ ద్వారా సాగునీటి సరఫరా నిలిపివేయాల్సి ఉంటుంది. కానీ అలా చేస్తే మూడు మండలాల్లో చివరి దశలో ఉన్న వరి పంటలు ఎండిపోయే పరిస్థితి ఉంటుంది. రైతుల విజ్ఞప్తి మేరకు గూడెం లిఫ్ట్‌ను నడిపిస్తే మాత్రం మంచిర్యాలకు తాగునీరు ఇవ్వడం కష్టం కానున్నది.

### మంచిర్యాల జిల్లాలో 330 గ్రామాలకు ఈ ప్రాజెక్టే దిక్కు..

జిల్లాలోని మంచిర్యాల, చెన్నూర్ నియోజకవర్గాల్లోని దాదాపు 330 గ్రామ పంచాయతీలు, మరో 20 తండాలు, గూడేలకు ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌లోని మిషన్ భగీరథ గ్రిడ్ నుంచే తాగునీరు సరఫరా అవుతుంది. జిల్లాలో ప్రతి రోజూ 6.75 ఎంఎల్‌డీ నీరు అంటే 0.09 టీఎంసీలు తాగడానికి కావాల్సి ఉంటుంది. రెండేళ్ల క్రితం రుతుపవనాలు ఆలస్యమై ఎల్లంపల్లి ప్రాజెక్టులో 8 టీఎంసీల నీరు ఉంది. కానీ అప్పుడు కాళేశ్వరం ఎత్తిపోతల ద్వారా ప్రాజెక్టును నింపుకునే అవకాశం ఉండడంతో ఎల్లంపల్లిలోకి నీరు ఎత్తిపోసి సాగు, తాగునీటికి ఎలాంటి ఢోకా లేకుండా చర్యలు తీసుకున్నారు. కాళేశ్వరంలో ఎత్తిపోస్తే ఎల్లంపల్లి మొత్తం నిండిపోయేది. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. సాగునీటి నిర్వహణలో పూర్తిగా విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం మేడిగడ్డ ప్రాజెక్టును రిపేర్ చేయకపోవడంతో ఎల్లంపల్లి ఎండాల్సిన దుస్థితి వచ్చింది. రెండేళ్ల క్రితం ఇదే సమయానికి బెడ్ లెవల్ 145 అడుగుల నీటితో నిండుకుండను తలపించిన ఎల్లంపల్లి ఇప్పుడు అడుగంటిపోతున్నది. ఎండల తీవ్రత ఇలాగే ఉంటే మాత్రం రెండు నెలల్లో ప్రాజెక్ట్ డెడ్ స్టోరేజీకి చేరుకోవచ్చని అధికారులు భావిస్తున్నారు. అదే జరిగితే మంచిర్యాల, చెన్నూర్ నియోజకవర్గాల్లోని ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడక తప్పదు. గతేడాది ఇదే పరిస్థితి వచ్చినప్పుడు నీటి కొరత లేకుండా చర్యలు తీసుకున్నా అధికారులు ఈ సారి ఏం చేస్తారు అన్న విషయంపై స్పష్టత లేకుండా పోయింది. ఈ విషయంపై మిషన్ భగీరథ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని అటు రైతులు, ఇటు మంచిర్యాల జిల్లావాసులు కోరుతున్నారు.

మిషన్ భగీరథ గ్రిడ్ చుట్టూ నీరు తగ్గిపోయి కనిపిస్తున్న అడుగుభాగం



# అటు పనులు.. ఇటు పగుళ్లు

## ఆసిఫాబాద్ జిల్లాలో ఈజీఎస్ సీసీ రోడ్ల నిర్మాణాల దుస్థితి

- నాణ్యతపై పర్యవేక్షణ కరువు
- నాసిరకం పనులపై గ్రామస్తుల ఆగ్రహం



*ఈ సీసీ రోడ్డు లింగాపూర్ మండలంలోని పీహెచ్‌సీ సమీపంలో ఉపాధి హామీ పథకం ద్వారా రూ.5 లక్షల వ్యయంతో నిర్మించారు. నిర్మాణం పూర్తి చేసి నాలుగు రోజులైనా కాలేదు..అప్పుడే కంకర తేలి పగుళ్లు వస్తున్నది. ఏళ్ల తరబడి ఉపయోగపడాల్సిన రోడ్లను కాంట్రాక్టర్ నాసిరకంగా నిర్మించడంతో నాలుగు రోజులకే పగుళ్లు తేలుతున్నాయని గ్రామస్తులు మండిపడుతున్నారు.*

కుమ్రం భీం ఆసిఫాబాద్ (నమస్తే తెలంగాణ)/లింగాపూర్, ఏప్రిల్ 2 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామాల్లో చేపట్టిన సీసీ రోడ్లు నిర్మాణ పనుల్లో నాణ్యతను పట్టించుకునే వారే కరువయ్యారు. ఓ వైపు రోడ్లు వేస్తుండగానే మరో వైపు పగుళ్లు తేలుతున్నాయి. పనుల్లో నాణ్యతపై పర్యవేక్షణ కొరవడడంతో కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా పనులు చేస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలో రూ.60 కోట్లతో 11 వందల వరకు రోడ్లు ఒకే సారి మంజూరు కావడం, నెల వ్యవధిలోనే వీటిని పూర్తిచేయాల్సి ఉండడంతో పనులు ఇష్టానుసారంగా నిర్వహిస్తున్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యతను పట్టించుకునే వారు లేక రోడ్లకు క్యూరింగ్ చేయకపోవడంతో వేసిన వారం రోజుల్లోనే కంకర తేలుతూ పగుళ్లు వస్తున్నాయి. ప్లాస్టిక్ కవర్లు పరిచి వాటిపై రోడ్లు వేస్తున్నారు. గంటల వ్యవధిలోనే రోడ్ల నిర్మాణాలను పూర్తి చేస్తున్నారంటే నాణ్యత ఏ మేరకు పాటిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. ఏండ్ల పాటు నిలవాల్సిన రోడ్లు అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా ప్రజలకు ఏమాత్రం ఉపయోగపడకుండా పోతున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి. అధికారులకు నిధులు ఖర్చుచేయడంపై ఉన్న శ్రద్ధ పనుల నాణ్యతపై ఉండడం లేదని విమర్శలు వస్తున్నాయి. లక్షల రూపాయలతో వేస్తున్న సీసీ రోడ్లు పైపై పూతల్లా తయారయ్యాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పనులు నాణ్యతగా చేపట్టేలా పర్యవేక్షించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



లింగాపూర్ మండల కేంద్రంలో నాణ్యత లేకుండా వేస్తున్నారని సీసీ రోడ్డుని చూపిస్తున్న గ్రామస్తులు

*ఈ సీసీ రోడ్డు లింగాపూర్ మండల కేంద్రంలోనిది. రూ.5లక్షలతో వేస్తున్న రోడ్డు నిర్మాణం మరింత దారుణంగా ఉంది. ఓ వైపు వేస్తుండగానే మరో వైపు పగుళ్లు తేలుతున్నది. రోడ్డు నిర్మాణంలో వినియోగించాల్సిన సిమెంట్, ఇసుక, కాంక్రిట్ సరిగా వేయడం లేదని మట్టిపై కవర్లు కప్పి నిర్మాణం నాసిరకంగా చేపడుతున్నారని గ్రామస్తులు ఆరోపించారు. రోడ్డు నాణ్యతను అధికారులు ఎవరూ పర్యవేక్షించడం లేదని, దీంతో కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా రోడ్డు వేస్తున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.*



# పోరాటయోధుడు సర్వాయి పాపన్న

## వర్ధంతి కార్యక్రమాల్లో మంచిర్యాల, కుమ్రంభీం ఆసిఫాబాద్ కలెక్టర్లు కుమార్ దీపక్, వెంకటేశ్ ధోత్రే



పాపన్నగౌడ్ చిత్రపటానికి పూల మాల వేస్తున్న మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్



నివాళులర్పిస్తున్న ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

నస్పూర్, ఏప్రిల్ 2 : బానిస ప్రజల విముక్తి, బహుజనుల రాజ్యాధికారం కోసం పోరాడిన యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని మం చిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం మంచిర్యాల జిల్లా నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ హాజరై పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ పాపన్న గౌడ్ పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. మహనీయుల వర్ధంతి, జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మోతీలాల్, అధికారులు పురుషోత్తం, వెంకటేశ్వర్‌రావు, రవీందర్‌రెడ్డి, రాజేశ్వరి, కల్పన, దుర్గా ప్రసాద్, సంఘం నాయకులు పాల్గొన్నారు.

### కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో..

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, ఏప్రిల్ 2: బహుజనుల రాజ్యాధికారం కోసం పోరాడిన యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. బుధవారం ఆసిఫాబాద్‌లోని కలెక్టరేట్‌లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతి వేడుకలకు జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డెవిడ్, అధికారులు, గౌడ సంఘం నాయకులు, వెనుకబడిన తరగతుల కులాల సంఘాల నాయకులతో హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి పాపాన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మొగలాయిల దౌర్జన్యాలు, జమీందారుల ఆగడాలకు వ్యతిరేకంగా పోరాడిన మహనీయుడని కలెక్టర్ కొనియడారు. ఆయనను భావి తరాలు స్ఫూర్తిగా తీసుకునేలా ఆయన చరిత్రను చాటిచెప్పాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి సజీవన్, డీపీవో భిక్షపతి గౌడ్, గౌడ సంఘం నాయకులు బాలేశ్ గౌడ్, సుదర్శన్ గౌడ్, మహిళా సంఘ అధ్యక్షురాలు అన్నపూర్ణ, వెనుకబడిన తరగతుల కులాల ప్రతినిధులు, గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.